వరద బాధితులకు అండగా ఉంటాం

పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



దుద్దుకూరులో ఎమ్మెల్యే బాలరాజుకు వినతిపత్రం అందజేస్తున్న చిగురుమామిడి వరద బాధితులు

బుట్టాయగూడెం : వరద బాధితులకు అండగా ఉంటామని, ఎవ్వరూ అధైర్యపడవద్దని, ప్రభుత్వం నుంచి అందే సహాయాన్ని ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తామని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు వరద బాధితులకు భరోసా ఇచ్చారు. బుట్టాయగూడెం మండలం దుద్దుకూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే తెల్లం బాలరాజును వేలేరుపాడు మండలం చిగురుమామిడి గ్రామస్తులు సోమవారం కలిశారు. వరదల కారణంగా ప్రభుత్వం అందించే నష్టపరిహారం రూ.2,000, కూరగాయలు, నిత్యవసర సరుకులు పునరావాస కేంద్రాలకు తరలివచ్చిన తమకు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా వచ్చిన గోదావరి వరదలతో చిగురుమామిడి గ్రామస్తులను 10 రోజుల ముందే పునరావాస కేంద్రాలకు తరలించారని చెప్పారు. తమకు ప్రభుత్వ పరంగా అందించే అన్ని సదుపాయలు అందించేలా కృషి చేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ గత ఏడాది కంటే ఈ ఏడాది వరద ప్రభావం తక్కువగానే ఉందన్నారు. భద్రాచలం వద్ద సుమారు 56 అడుగుల వరకూ వచ్చి తదుపరి తగ్గుతూ వచ్చిందని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో అధికార యంత్రాంగం అంతా అప్రమత్తమై ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారని అన్నారు. వేలేరుపాడు, కుక్కునూరు మండలాల పరిధిలో సుమారు 45 ప్రాంతాల వరకూ ముంపునకు గురయ్యాయని చెప్పారు. వేలేరుపాడులో 35, కుక్కునూరులో 10 గ్రామాలు ముంపునకు గురయ్యాయని అన్నారు. ఈ రెండు మండలాల్లో సుమారు 4779 మంది కుటుంబాలకు సంబంధించి 13746 మంది వరద బారిన పడ్డారని అన్నారు. వీరిలో సుమారు 9,166 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించి వారికి అన్ని విధాలా సేవలు అందించేలా కృషి చేయడం జరుగుతుందని చెప్పారు. వారికి కావాల్సిన ఆహారం అందించేలా కృషి చేస్తున్నామని చెప్పారు. అలాగే ప్రజలకు అత్యవసర సేవలు అందించే విధంగా అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచి వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి వరదలో చిక్కుకున్న ప్రజలకు సేవలు అందించేలా కృషి చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వం నుంచి అందే సహాయాన్ని ప్రతిఒక్కరికీ అందేలా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో చిగురుమామిడికి చెందిన ప్రజలు పాల్గొన్నారు.

మణిపూర్ మారణకాండపై నిరసనలు



జంగారెడ్డిగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



కొయ్యలగూడెంలో పాస్టర్ల నిరసన



లింగపాలెంలో వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : గత మూడు నెలలుగా విరామం లేకుండా మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న మారణకాండపై సోమవారం నిరసనలు వెల్లువెత్తాయి. జంగారెడ్డిగూడెం డివిజన్ క్రైస్తవ ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం స్థానిక చంద్ర కళ్యాణ మండపం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. మసీద్ సెంటర్లో మానవహారం నిర్వహించి మణిపూర్‌ను కాపాడాలని, శాంతిని పునరుద్ధరించాలని నినాదాలు చేశారు. అనంతరం ఎమ్మెల్యేకు, ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రాలు సమర్పించారు. ర్యాలీలో ఏపీ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ పందు జగదీష్, జంగారెడ్డిగూడెం క్రైస్తవ ఐక్యవేదిక ఆధ్వర్యంలో సీహెచ్ స్టీఫెన్, కె.విజయరామారావు, గిరిజన సంఘం నాయకులు రామ్మోహన్, ముస్లిం నాయకులు ముస్తఫా, లివింగ్ శాక్రిఫైజ్ మినిస్ట్రీస్ అధ్యక్షులు, జంగారెడ్డిగూడెం డివిజన్ పరిధిలోని పాస్టర్లు, క్రిస్టియన్ విశ్వాసులు, ముస్లిం మైనార్టీ దళిత సంఘాల నాయకులు మొదలైన వారు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మణిపూర్ క్రైస్తవులకు రక్షణ కల్పించాలి

లింగపాలెం : మణిపూర్ క్రైస్తవులకు రక్షణ, స్వేచ్ఛ కల్పించాలని కోరుతూ లింగపాలెం మండలంలోని అన్ని పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు సోమవారం లింగపాలెంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పాస్టర్లు మాట్లాడుతూ మణిపూర్‌లో ఆ రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోని శాంతి నెలకొల్పాలని, అక్కడ క్రైస్తవులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు తహసీల్దార్ మురళీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండలంలోని పాస్టర్లు, ఉపదేశలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కొయ్యలగూడెంలో శాంతి ర్యాలీ

కొయ్యలగూడెం : మణిపూర్ అల్లర్లను నిరసిస్తూ పాస్టర్స్ అసోసియేషన్ క్రైస్తవ సంఘాలు కొయ్యలగూడెంలో సోమవారం ర్యాలీ, నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. మణిపూర్ మారణకాండపై సుప్రీం కోర్టు రిటైర్డ్ న్యాయమూర్తితో విచారణ జరిపించాలని, ఈ ఘటనలపై వెంటనే అక్కడి రాష్ట్ర ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలవరం రోడ్డు మీదగా శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆంధ్రప్రదేశ్ జనరల్ సెక్రెటరీ కొయ్యలగూడెం మండల పాస్టర్స్ యూనియన్ అధ్యక్షులు ఎం.దేవసహాయం, యూనియన్ ముఖ్య సలహాదారులు ఎం.సువర్ణరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ జై.బాలస్వామి, సెక్రటరీ కె.జైపాల్, జాయింట్ సెక్రెటరీ జె.రాజు, కోశాధికారి దానియేలు, ఫాదర్ శౌరి పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

- చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా
- నాగులగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం



నాగులగూడెంలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న చింతలపూడి ఎమ్మెల్యే ఎలీజా

జంగారెడ్డిగూడెం రూరల్ : గ్రామాల్లో మౌలిక సదుపాయాలను కల్పిస్తూ అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. జంగారెడ్డిగూడెం మండలం నాగులగూడెం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే ఎలీజా ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దృష్టికి స్థానిక ప్రజలు పలు సమస్యలను తీసుకొచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నాగులగూడెం గ్రామంలో ప్రభుత్వ పథకాల ద్వారా అనేక కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయన్నారు. ఈ గ్రామంలో ఎంతోకాలంగా ప్రభుత్వ భూముల్లో ఇల్లు నిర్మించుకుని నివసిస్తున్నారని ఖాళీ చేయాలని చెప్పడంతో పేదల పక్షాన నిలిచి కోర్టుకు వెళ్లడం జరిగిందని ఎమ్మెల్యే చెప్పారు. కోర్టు నుంచి ఆర్డర్ తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాలు కల్పించి గృహాలు నిర్మిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అలాగే డ్రెయినేజీ, రహదారి సమస్యలపై మాట్లాడుతూ ఒక డ్రైనేజీ, ఒక రహదారిని మంజూరు చేసినట్లు చెప్పారు. అర్హులైన వారికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించడంతోపాటు, గ్రామాల్లో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధితో ప్రజలు ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, ఎంపీటీసీ కొయ్య రమారెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా యూత్ అధ్యక్షులు పడమటి గిరిబాబు, వైస్ ఎంపీపీ నరెడ్ల బుజ్జిబాబు, సచివాలయాల మండల కన్వీనర్ గురజాల పార్థసారథి, నిట్టా బాలయ్య, సాయిల స్వాతి, ఎంపీడీవో కిరణ్ కుమార్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించాలని ఆందోళన



పాత బస్టాండ్‌లో ఆందోళన చేస్తున్న కాలనీ వాసులు

చింతలపూడి : చింతలపూడి నగర పంచాయతీ పరిధిలోని వైఎస్సార్ కాలనీకి వెళ్లే రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరుతూ కాలనీవాసులు పట్టణంలో ఆందోళన చేపట్టారు. సోమవారం పాత బస్టాండ్‌కు పెద్ద ఎత్తున చేరుకున్న కాలనీవాసులు ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. చింతలపూడి, ఏలూరు ప్రధాన రహదరిపై రాస్తారోకో చేశారు. రహదారి, డ్రెయినేజీల నిర్మాణం చేపట్టే వరకు ఆందోళన విరమించేది లేదని చెప్పారు. అధికారులు స్పందన కార్యక్రమంలో ఉన్నారని తెలుసుకున్న కాలనీవాసులు అక్కడి నుంచి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని అధికారులను నిలదీశారు. తహసీల్దార్ కృష్ణ జ్యోతి, నగర పంచాయతీ కమిషనర్ ఎన్ రాంబాబు ఆందోళనకారులతో చర్చలు జరిపారు. త్వలోనే జిల్లా కలెక్టర్‌ను కలిసి సమస్యలు తెలియజేస్తామని, కాలనీలో అన్ని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

చెట్టు పట్టాలు మంజూరు చేయాలి

ఏలూరు (టూటౌన్): దళిత మహిళా రైతులకు చెట్టు పట్టాలు మంజూరు చేయాలని దళిత సేన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. డీఆర్‌ఓకు వినతి పత్రం అందజేశారు. లింగపాలెం మండలం తోచలకరాయుడపాలెం గ్రామానికి చెందిన 25 మంది దళిత మహిళా రైతులు అటవీ భూమిలో ప్రస్తుతం జీడిమామిడి సాగు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత సేన నాయకులు, దళిత మహిళా రైతులు పాల్గొన్నారు.

మదన్ మృతి పార్టీకి తీరనిలోటు



వైఎస్సార్ సీపీ నేత మదన్ (ఫైల్)

వేలేరుపాడు : భూదేవిపేట కు చెందిన వైఎస్సార్ సీపీ నేత ముప్పానేని మదన్ (40) గుండెపోటుతో ఆదివారం రాత్రి మృతి చెందారు. అతని మృతిపై ఎమ్మెల్యే తెల్లం బాలరాజు సంతాపం తెలిపారు. మదన్ మృతి పార్టీకి తీరని లోటన్నారు. మదన్ కుటుంబాన్ని పార్టీ తరపున ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. మదన్ మృతిపై పార్టీ నాయకులు సంతాపం తెలిపారు.

ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం : మహిళ పట్ల అసభ్యకరంగా, అనుచితంగా ప్రవర్తించిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగరబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం స్థానిక సుబ్బమ్మ పేట రోడ్డులో పి.మంగ అనే మహిళ నివసిస్తోంది. ఆమెకు భర్త లేకపోవడంతో పిల్లలతో జీవిస్తోంది. అయితే తన ఇల్లు గతంలో ఒక మహిళకు అద్దెకు ఇవ్వగా అద్దెకు ఉంటున్న వారు ఈనెల 30వ తేదిన ఖాళీ చేశారు. అయితే వారితోపాటు వచ్చిన విస్సంపల్లి సిద్దు, వాసు చౌదరి అనే వ్యక్తులు ఇంట్లో ఒక గదికి తాళం వేసి తన పట్ల అసభ్యకరంగ, అనుచితంగా ప్రవర్తించారని, తమ మాట వినకపోతే రౌడీలతో అత్యాచారం చేయిస్తామని, చంపుతానని బెదిరించినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. అంతేగాక రెండు రోజులపాటు ఆ గదిలోనే ఉంటామని రూ.3 లక్షలు ఇవ్వాలని, లేకపోతే తమతో శారీరకంగా ఉండాలని వేధించినట్లు మంగ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

పెట్రోల్ బంక్‌పై విజిలెన్స్ దాడులు

జంగారెడ్డిగూడెం : పట్టణంలో ఒక హెచ్‌పీ పెట్రోల్ బంక్‌పై సోమవారం విజిలెన్స్, తూనికలు, కొలతల అధికారులు తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా అన్ని పత్రాలు, కొలతలు సక్రమంగా ఉన్నట్లు విజిలెన్స్ సీఐ పి.శివరామకృష్ణ తెలిపారు. ఈ తనిఖీల్లో ఏఓ పి.సురేష్, తూనికలు, కొలతల శాఖ ఏసీపీ సాయిరాం, ఏఈ పి.శ్రీనివాసరావు, ఏఓ పి.సురేష్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం లయన్స్ క్లబ్ భవనంలో జంగారెడ్డిగూడెం, బుట్టాయగూడెం లయన్స్ క్లబ్ 2023–24 నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం జరిగింది. జంగారెడ్డిగూడెం లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్‌గా కె.హనుమంతరావు, వైస్ ప్రెసిడెంట్‌లుగా ఎన్.రామచంద్రరాజు, డి.శేషుకుమార్, సెక్రటరీగా కె.పండు, బుట్టాయగూడెం లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్‌గా ఎన్.మధుసూధన్‌బాబు, వైస్ ప్రెసిడెంట్‌లుగా ఎన్.ఏసుపాదం, ఎల్.వెంకట రమణ, సెక్రటరీగా జె.శివరామకృష్ణ ప్రమాణ స్వీకారం చేశారు. లయన్స్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, వైస్ గవర్నర్ కాకర్ల వీరబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

పంటలను ఈ–క్రాప్‌లో నమోదు చేసుకోవాలి



ఈ-క్రాప్ నమోదుపై అవగాహన కలిగిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం : ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పంటలు వేసిన రైతులు తప్పనిసరిగా తమ పంట వివరాలను ఈ–క్రాప్‌లో నమోదు చేసుకోవాలని తహసీల్దార్ ఎస్.శారాశాంతి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఏఏలు, వీఆర్‌ఓలతో పంట నమోదుపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పంటల వివరాలను రైతు భరోసా కేంద్రం వద్ద వ్యవసాయ, ఉద్యాన సహాయకులను సంప్రదించి పంట వేసిన సర్వే నంబర్, ఆధార్ నంబర్ వివరాలను సమర్పించి పంట నమోదుకు సహకరించాలని అన్నారు. ఏఓ బి.సుమలత మాట్లాడుతూ భూమిలేని కౌలు రైతులు కూడా ఆర్‌బీకేలో పంటసాగు హక్కు పత్రాలకు దరఖాస్తు చేసుకుని, వారు కూడా పంట నమోదు చేసుకోవాలని అన్నారు.

హెచ్‌ఎం మాకొద్దంటూ పాఠశాల వద్ద నిరసన

విచారణ నిర్వహించిన డీఈవో



పేరెంట్స్ కమిటీ చైర్మన్, ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో శ్యాంసుందర్

పెదవేగి : వివిధ ఆరోపణలపై సస్పెండైన ప్రధానోపాధ్యాయుడిని మళ్లీ అదే పాఠశాలకు నియమించడంపై తల్లిదండ్రుల కమిటీ ఆధ్వర్యంలో పాఠశాల ప్రధాన గేటు వద్ద కొంత మంది ఆందోళన చేశారు. పెదవేగి మండలం కొప్పాక ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న సీహెచ్ ప్రసన్నాంజనేయులును గతంలో పలు ఆరోపణలతో ఉన్నతాధికారులు సస్పెండ్ చేసిన విషయం విదితమే. ఈ మేరకు సస్పెన్షన్ ఎత్తివేయడంతో తిరిగి మళ్లీ అదే పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడిగా ఆయనను నియమిస్తూ కాకినాడ ఆర్జేడీ ఉత్తర్వులు ఇవ్వడంతో ప్రసన్నాంజనేయులు సోమవారం విధులకు హాజరయ్యారు. ప్రధానోపాధ్యాయుడు పాఠశాలకు వచ్చారన్న సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ఏ. వెంకటనారాయణ ఆధ్వర్యంలో కొంతమంది తల్లిదండ్రులు పాఠశాల వద్దకు చేరుకొని గేటు ఎదుట ప్రసన్నాంజనేయులు వద్దంటూ ఆందోళన చేపట్టారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని పెదవేగి మండల విద్యాశాఖాధికారి సీహెచ్. బుధవ్యాస్ వారికి నచ్చచెప్పినా వారు ఆందోళన కొనసాగించారు. తమ పిల్లలకు టీసీ ఇచ్చి వేరే పాఠశాలకు పంపించాలని, లేదంటే ప్రధానోపాధ్యాయుడిని వేరే పాఠశాలకు బదిలీ చేయాలంటూ ఆందోళనను కొనసాగించారు. దీంతో సమాచారం అందుకున్న డీఈవో శ్యాంసుందర్ ఉన్నత పాఠశాలకు చేరుకొని విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బందితో విడివిడిగా చర్చించారు. అందరూ ప్రధానోపాధ్యాయుడు వద్దని తెలిపారు. ప్రసన్నాంజనేయులు వద్దంటూ డీఈవోకి తల్లిదండ్రుల కమిటీ రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. డీఈవో శ్యాంసుందర్ మాట్లాడుతూ నివేదికను సిద్ధం చేసి కలెక్టర్‌కి నివేదిస్తామని తెలిపారు.

కార్పొరేషన్ షాపులకు వేలం ఖరారు

ఏలూరు టౌన్: ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో ఖాళీగా ఉన్న షాపులకు వేలంపాట నిర్వహించి, అద్దె ప్రాతిపదికన కేటాయిస్తూ అనుమతులు మంజూరు చేశామని నగర మేయర్ షేక్ నూర్జహాన్ తెలిపారు. ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ కార్యాలయంలో మేయర్ చాంబర్‌లో ప్రొసీడింగ్ ఆర్డర్స్‌ను మేయర్ నూర్జహాన్, డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్ బాబు చేతులమీదుగా పాటదారులకు అనుమతి పత్రాలను అందజేశారు. నగరంలోని బుద్ధపార్క్ సమీపంలో ఆరు షాపులు, న్యూ ఫిష్ మార్కెట్‌లో 14 షాపులను వేలంపాటలో దక్కించుకున్న వ్యక్తులకు అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ నూర్జహాన్ మాట్లాడుతూ ఒక్కో షాపును 25 సంవత్సరాలకు లీజు ప్రాతిపదికన నెలకు రూ.3 వేలు అద్దె చెల్లించేలా నిర్ణయించామన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఏలూరు టౌన్: తల్లి మందలించిందని తీవ్ర మనస్థాపానికి గురైన యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అతడ్ని ఏలూరు జీజీహెచ్‌లో చేర్పించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఏలూరు రూరల్ ఎస్సై లక్ష్మణబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు మండలం ప్రత్తికోళ్లలంక గ్రామానికి చెందిన భలే కృష్ణంరాజు (27) కూలిపనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కృష్ణంరాజు తల్లి కొంతకాలం క్రితం కువైట్ దేశం ఉపాధి కోసం వెళ్లింది. ఆమె డబ్బులు పంపుతూ ఉండగా కృష్ణంరాజు సొమ్మును విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నాడు. ఈ విషయం తెలిసిన తల్లి అతడ్ని మందలించింది. తీవ్ర మనస్థాపానికి గురైన కృష్ణంరాజు ఈనెల 26న విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు అతడిని ఏలూరు జీజీహెచ్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

క్లుప్తంగా

విజయదుర్గమ్మ ఆలయంలో చండీహోమం



చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : పట్టణంలో పాత ఆంధ్ర బ్యాంక్ వీధిలో వేంచేసిఉన్న శ్రీ విజయదుర్గ అమ్మవారి ఆలయంలో మూలా నక్షత్రం సందర్భంగా 5వ చండీ హోయం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సుదర్శనం వేణుగోపాలాచార్యులు, వేద పండితులు జి.సత్యకిరణ్ ఆధ్వర్యంలో చండీహోమం అత్యంత వైభవంగా జరిపారు. మహంకాళి గుప్తా దంపతులు ఈ హోమంలో ఉభయులుగా వ్యవహరించారు. అనంతరం ఆ దంపతులను ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి శేష వస్త్రాలతో సత్కరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మారిశెట్టి రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి మాడా రామమోహన్‌రావు, సభ్యులు పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం



దాత కుటుంబానికి విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈఓ నటరాజారావు

ద్వారకాతిరుమల : శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు సోమవారం రూ. 1,00,200 విరాళంగా అందజేశారు. ఉండి మండలం అగ్రహారానికి చెందిన దేవరకొండ ఎ.శ్రీకాంత్, ఎస్ఎల్ ప్రియాంక దంపతులు ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని నిత్యాన్నదాన కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాత కుటుంబానికి ఆలయ ఏఈఓ పి.నటరాజారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

శ్రీవారి ప్రథమ చికిత్సా కేంద్రానికి మందుల అందజేత



డాక్టర్ రాజేంద్రప్రసాద్‌కు మందులను అందజేస్తున్న దాత సుబ్రహ్మణ్యం

ద్వారకాతిరుమల : శ్రీవారి ప్రాణదాన ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రథమ చికిత్సా కేంద్రానికి ఒక భక్తుడు రెండు వేల మంది భక్తులకు సరిపడా మందులను సోమవారం విరాళంగా అందజేశారు. తెనాలికి చెందిన ఏవీ సాంబశివరావు సహకారంతో అదే గ్రామానికి చెందిన దాత ఎం.సుబ్రహ్మణ్యం ఆ మందులను ప్రథమ చికిత్సా కేంద్రం వైద్యుడు రాజేంద్రప్రసాద్‌కు అందజేశారు. అనంతరం పలువురు భక్తులకు అవసరమైన మందులను అందించారు. దాతను ఈఓ వేండ్ర త్రినాధరావు అభినందించారు.

నేడు చొప్పరామన్నగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం

కొయ్యలగూడెం : చొప్పరామన్నగూడెం పంచాయతీ పరిధిలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే తెల్లం బాలరాజు హాజరై ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రచారం చేస్తారని అన్నారు.

పేకాట శిబిరంపై దాడి

జంగారెడ్డిగూడెం : స్థానిక సుబ్బమ్మ పేట రోడ్డులో ఎస్ఈబీ అధికారులు పేకాట శిబిరంపై దాడి చేసి 8 మందిని అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.8,310, 7 సెల్‌ఫోన్లు, 4 మోటార్ సైకిళ్ల స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగరబాబు తెలిపారు.

పాము కాటు బాధితుడిని కాపాడిన ఆపదమిత్ర



చికిత్స పొందుతున్న దేవాతో ఆపదమిత్ర బాబు

కుక్కునూరు : పాము కాటుకు గురైన వ్యక్తిని సకాలంలో ఆసుపత్రికి తీసుకువచ్చి వైద్యం అందించి ప్రాణాన్ని నిలబెట్టాడు మండలానికి చెందిన ఆపదమిత్ర. వివరాల్లోకి వెళితే మారేడుబాక గ్రామానికి చెందిన గుగులోత్ బాబు మండలంలో ఆపదమిత్రగా విధులు నిర్వహిస్తున్నాడు. కాగా సోమవారం ఉదయం కొండపల్లి గ్రామానికి చెందిన సోడే దేవా (45) పాముకాటుకు గురయ్యాడు. విషయం తెలిసిన గృహసారథి హరీష్ విషయాన్ని ఆపదమిత్ర బాబుకి చెప్పడంతో వెంటనే స్పందించిన అతను దేవాను బైక్‌పై కూర్చోబెట్టుకుని కుక్కునూరు ఆసుపత్రికి తరలించి సమయానికి వైద్యం అందేలా చేశాడు. దీంతో దేవా ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. ప్రభుత్వం ముందు జాగ్రత్తతో శిక్షణనిచ్చి ఏర్పాటుచేసిన ఆపదమిత్రలు ఆపత్కాలంలో చేస్తున్న సేవల పట్ల మండల ప్రజానీకం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులకు హోమియో మందుల పంపిణీ



తడికలపూడిలో హోమియో మందులు అందజేస్తున్న డా రఫియ పర్వీన్

కామవరపుకోట : మండలంలో కండ్ల కలక వైరస్ ఉన్న నేపథ్యంలో స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు సోమవారం హోమియో మాత్రలు ఉచితంగా అందచేసి కళ్లల్లో హోమియో చుక్కలు వేశారు. తడికలపూడి ప్రభుత్వ హోమియో వైద్యాధికారిణి డా రఫియ పర్వీన్ హోమియో మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డా పర్వీన్ మాట్లాడుతూ కండ్ల కలక రాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలని అన్నారు. కండ్ల కలక వచ్చిన వారు తమ హోమియో ఆసుపత్రిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామసుందరి, హోమియో వైద్య సహాయకులు శ్రీనివాసరావు, పి.నాగరాజు, కె రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

జంగారెడ్డిగూడెం : విజయవాడ బార్ అసోసియేషన్ సభ్యుడు విఠల్ కుమార్ హత్యను నిరసిస్తూ జంగారెడ్డిగూడెం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పరిపాలన అధికారికి వినతి పత్రం సమర్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అచ్యుత శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇటీవల న్యాయవాదులపై దాడులు ఎక్కువగా జరుగుతున్నందున ప్రభుత్వం వెంటనే స్పందించాలన్నారు. విఠల్‌కుమార్‌పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైస్ ప్రెసిడెంట్ తల్లాడి అశోక్ కుమార్, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఏవీవి.భువనేశ్వరి న్యాయవాదులు పాల్గొన్నారు.